# కథ

-యల్లాప్రగడ సువర్చలాదేవి

# ఇరుకు మనసు

**వైజాగ్ రైల్వేస్టేషన్ రద్దీగా ఉంది. ఉదయం ఏడు గంటలవుతోంది. చలికాలం కావడంతో బయట చలి ఎక్కువగానే ఉంది. మబ్బుల ముసుగు చాటు నుండి బద్ధకంగా బయటకు తొంగి చూస్తున్న సూర్యుడికి తనకన్నా త్వరత్వరగా తెమిలి ఉరుకులు, పరుగులు పెడ్తున్న జనం కనబడుతున్నారు. 'ఈ రోజు ఆదివారమే కదా, ఈ రోజన్నా ఈ జనం కాస్త తనకు విశ్రాంతి నివ్వొచ్చు కదా' అనుకొంటున్నాడు.**

వైజాగ్ నుండి అరకు వెళ్ళే రైలు మరికొద్ది నిమిషాలలో బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. ఆరోజు ఆదివారం కూడా కావడంతో రైలు బాగానే నిండింది.

''సార్..కొంచెం పక్కకు జరుగుతారా..పిల్లాడు కూర్చొంటాడు'' అన్న మాటతో పేపర్‌లోంచి తల బయటపెట్టి చూశాడు సంపత్. అరకు లోయల్లో పుట్టి పెరిగిన మనుషుల్లా ఉన్నారు. ఫోటోల్లో చూపించేటట్లు మరీ సాంప్రదాయ గిరిజనుల్లా లేరు గానీ బాగా నలిగి, మాసిన చొక్కా, అలాంటిదే ఓ లుంగీ, పైన ఓ చిన్న కండువాలాంటిది, చేతిలో ఏవో ముతకగుడ్డ సంచుల్లాంటివి ఉన్నాయి. పక్కన అతడి భార్య ఓ చంటి పిల్లని ఎత్తుకొని, ఏవో సంచులు కూడా పట్టుకొని ఉంది. అటు, ఇటు జారిపోతున్న ఏడేళ్ళ కొడుకుని గట్టిగా పట్టుకొని ఉన్నాడు. వాడి అవతారం దాదాపు అంతే. చిరాకనిపించింది సంపత్‌కి. బహుశా సిటీల్లో బెగ్గర్స్ కూడా ఇంతకన్నా నీట్‌గానే ఉంటారు అనుకొన్నాడు మనసులో కసిగా. ''ఇప్పుడు వీళ్ళొచ్చి ఇక్కడంతా నానా..'' అనుకొంటుండగానే ఆ పిల్లాడు తండ్రి చేయి వదిలించుకొని గభాల్న వచ్చి సంపత్‌కి, ఆనుకొంటూ కూర్చొంటూ పక్కనే ఉన్న వంశీ చేతిలోని మొబైల్ వంక ఆత్రంగా చూడసాగాడు. అందులో గేమ్ ఆడుతున్న వంశీ ఒక్కక్షణం బెదిరి అయోమయంగా తండ్రి కేసి చూశాడు.

సంపత్ ఆగ్రహం అప్పటికే కట్టలు తెంచుకొంది ఎందుకంటే, తొందరలో ఆ పిల్లాడి కాలు సంపత్ పాదం మీద, అతని చేయి సంపత్ పేపర్ మీద పడ్డాయి. ''యూ...'' ఏదో అనబోయాడు. కళ్యాణి చేయి మీద పడటంతో ఒక్కసారి భార్య వంక చూశాడు. కోపాన్ని కంట్రోల్ చేసుకోమన్నట్లు కళ్ళతోనే సైగ చేసింది. అతి కష్టం మీద నోరు లేవకుండా ఆపుకొన్నాడు. జరిగినదంతా చూస్తున్న ఆ పల్లెటూరి వ్యక్తి గభాల్న తన కొడుకు రెక్కపట్టి లాగి ఒక్కటిచ్చాడు. ''ఒక్క నిమిషం కుదురుగా ఉండవు'' అన్న అర్థం వచ్చేలా తన యాసలో ఏదో అన్నాడు. పక్కనెక్కడైనా కూర్చొనే స్థలం ఉందేమోనని చూశాడు. అప్పటికే అక్కడంతా గంపలు, సంచులు, పాలక్యాన్లు ఇలా నిలబడే స్థలం కూడా కనబడటం లేదు. ఇంకా వెనుకనుంచి అప్పుడే అక్కడికి చేరిపోతున్నారు జనం. ఇక ఆలోచించడానికి ఏమీ లేదు అన్నట్లు కిందనే కూర్చొన్నారు. సీట్లలో సంపత్, అతని భార్య, కొడుకు, కూతురు వాళ్ళ సామాన్లు ఉన్నాయి. వెనుకనుండెవరో 'ఆ సామాన్లను కింద సర్దితే కూర్చోవచ్చు కదా' అంటున్నారు. ఇంకాసేపు ఆగితే ఇంకా ఎవరొచ్చి కూర్చుంటారో అంటూ గొణిగాడు సంపత్. వచ్చిన వాళ్ళ వైపు చీదరింపుగా చూసి బయటికి మరల్చాడు చూపుని. రైలు కదిలింది. హడావుడి సర్దుమణిగింది. ''మన దారిన మనం కారులో వెళ్దామంటే విన్నావు కాదు'' అన్నాడు అసహనంగా భార్యతో.

''అరకుకి వెళ్ళేటప్పుడు రైల్లో వెళ్ళడం చాలా బాగుంటుందిట'' అంటున్న భార్య మాటలకి మధ్యలోనే అడ్డువస్తూ ''ఏం బాగో! బయట అందాల సంగతేమోగానీ, లోపల మాత్రం ఈ సంతలో కూర్చోలేక ఛస్తున్నా'' అన్నాడు ఇంగ్లీషులో, అక్కడివారికి అర్థం కాకూడదని. ఏనిమిదేళ్ళ ప్రీతీ తండ్రి వంక, అక్కడున్న వాళ్ళ వంక ఓసారి చూసి కిసుక్కున నవ్వి, మళ్ళీ డాడీకి కోపం వస్తుందని కిటికీ నుండి బయటకు చూడసాగింది.

రైలు బయలుదేరి గంట దాటింది. కానీ సంపత్‌లోని అసహనం మాత్రం తగ్గలేదు. అమెరికాలో పదేళ్ళు ఉన్నాడు. ఈమధ్యనే ఇండియా వచ్చి తన మిత్రుడు ఒకతను పెట్టిన కంపెనీలో భాగస్వామిగా చేశాడు. అమెరికాలోని రోడ్లు, శుభ్రత, అక్కడి ప్రజలు అవన్నీ చాలా ఉన్నతంగా తోచేవి. ఇండియా వచ్చినప్పటి నుండీ ప్రతీది అమెరికాతో పోల్చుకోవటం అలవాటైపోయింది. మిగతా విషయాలు ఎలా ఉన్నా శుభ్రత, ప్రజల అలవాట్లు విషయంలో మాత్రం ఇండియాలో సర్దుకోలేకపోతున్నాడు. ఆల్ప్స్ పర్వతాలు, నయాగరా జలపాతాలు మొదలుకొని కొండలు, కోనలు, సముద్రాలు, లోయలు, మంచు తుపానులు, రంగురంగుల చెట్లు, బహుశా అన్ని అద్భుతాలూ చూశానులే అనేలా అన్నీ చూశాడు. ఇండియా వచ్చినప్పటి నుండీ ఎక్కడికీ వెళ్ళడానికి తీరిక దొరకలేదు. ఈమధ్యనే ఓ వారం రోజులు కాస్త తీరిక దొరకడంతో వైజాగ్‌లో స్థిరపడిన తన తల్లిదండ్రులతో గడుపుదామని వచ్చాడు.


అందరూ చెప్పడంతో, ముఖ్యంగా భార్యా పిల్లల బలవంతంతో అరకు ప్రయాణం పెట్టారు. రైలు ప్రయాణం కూడా బలవంతం మీదే. వీలైనంత వరకూ విమానంలో కాకపోతే ఏ కారులో తప్ప ప్రయాణం చేయని సుకుమార శరీరం అరకు రైల్లో ఆపసోపాలే పడుతోంది.

''డాడీ వాటర్'' అన్న ప్రీతి మాటలకి ఈలోకంలోకి వచ్చాడు సంపత్. బ్యాగ్‌లో నుండీ మినరల్ వాటర్ బాటిల్ తీసి, చిన్న డిస్పోజిబుల్ ప్లాస్టిక్ గ్లాస్‌లో పోసి ఇచ్చాడు. నీరు కనపడంగానే ఆ పల్లెటూరి పిల్లాడికి దాహమేసింది. ''అయ్యా దప్పిక'' అన్నాడు తండ్రి వైపు చూస్తూ, సంపత్ చేతిలోని నీళ్ళ బాటిల్ వంక వేలితో చూపెడుతూ. ''డబ్బులు పెట్టి కొన్న నీళ్ళు వీళ్ళకా'' అంటూ బాటిల్ తీసి బ్యాగ్‌లో పెట్టేసి, బ్యాగ్‌ని వాళ్ళకు కనపడని పక్కగా పెట్టేసి, సీరియస్‌గా బయట చూడసాగాడు.

''ఏదైనా టేషన్ వచ్చాక తాపిస్తాలేరా'' విసుకొన్నాడు ఆ పల్లెటూరితను కొడుకు

పైన. మరికొద్దిసేపు తర్వాత కళ్యాణి బ్యాగ్ లోంచి బిస్కట్ ప్యాక్ తీసి పిల్లలిద్దరికి ఇచ్చింది. ''నాకొద్దు మమ్మి'' అంటూ వంశీ మారాం చేసినా బలవంతంగా తినిపించి భర్త తింటాడేమో అని ప్యాక్ అతనికివ్వబోయింది. వద్దని సంపత్ చెప్పేలోపే ఆ పల్లెటూరతని అబ్బాయి సుడిగాలిలా దూసుకొచ్చి చెయ్యి చాపాడు.

ఈ హఠాత్ పరిణామంతో మరోసారి కోపంతో ఊగిపోయాడు సంపత్. దాదాపు వాడిని కొట్టబోయే వాడే గానీ, వారి శరీరానికి తన చెయ్యి తాకితే ఎక్కడ వాడి మట్టి అంటుకుంటుందేమో అన్నట్లు చివరి నిమిషంలో ఆగిపోయి, ''పిల్లాడిని జాగ్రత్తగా చూసుకోకుండా ఏంటిది'' అన్నాడు విసురుగా ఆ పల్లెటూరతనితో.



''తిన్నగా కూర్చోలేవా?'' అంటూ అరిచి, నాలుగు దెబ్బలేశాడు అతను, వాడి ఏడుపు, చుట్టు పక్కనున్న వాళ్ళ కామెంట్లతో అక్కడిక సీను తయారైంది. ''వాడికో బిస్కెట్టు ఇస్తే అయిపోయేది కదా! ఎందుకీ గోల'' అంది కాస్త కోపంగా కళ్యాణి.

''అసలు నీవల్లనే మనం ఈ వెధవ రైల్లో రావల్సొచ్చింది'' భార్య మీద గయ్యిమన్నాడు.

ఎందుకంటే దాదాపు సగం ప్రయాణం అయిపోయింది అప్పటికే. ఇక మిగతా ప్రయాణం కూడా రైల్లోనే కానియ్యాలి. అక్కడ, అప్పుడు తనకి ఏ కారు దొరికే అవకాశం లేదు. తనూ మరో మాటంటే గొడవ పెద్దదయ్యే అవకాశం ఉందని మౌనంగా కిటికీ నుండీ బయటికి చూడసాగింది కళ్యాణి.

అందమైన లోయలు, అద్భుతమైన టన్నెల్స్, పచ్చని ప్రకృతి, పసుపచ్చని అవిశెపూలు ఇవేవి ఇందాకంత ఆనందాన్ని ఇస్తున్నట్టు లేదు అక్కడెవరికీ. చదువుకోకపోయినా వారి మనస్సుని గ్రహించగలిగాడు ఆ పల్లెటూరతను. లేచి పక్కనెక్కడైనా చోటుందేమో అని చూశాడు. సీట్లలోనే కాక నడిచే దారిలో కూడా మనుషులు, సామాన్లు ఉండటంతో చేసేది లేక కొడుకుని తీసుకెళ్ళి కొద్దిదూరంలో ఏదో బస్తా మీద కూర్చోబెట్టి, కదలొద్దని గదమాయించి వచ్చాడు.

అతి కష్టం మీద రైలు ప్రయాణం పూర్తి చేశాడు సంపత్. అతని వైపు చూడటానికే భయపడ్డాడు పల్లెటూరతను. అక్కడ ఎవరి వైపు చూడటానికి కూడా ఇష్టపడలేదు సంపత్. స్టేషన్ బయటికి వస్తూనే టాక్సీని పిలిచాడు. బేరం కూడా ఆడలేదు. కొద్ది క్షణాల్లో ఏసీ రిసార్ట్‌లో ఉన్నారు. వేణ్ణీళ్ళస్నానం తర్వాత కాస్త చల్లబడ్డాడు. పరిశుభ్రమైన రహదారులు, ఆకుపచ్చని చెట్లు, వాటి మధ్య అందంగా, పొందికగా కట్టిన రిసార్ట్స్ మనసుకి ఉల్లాసాన్నిస్తున్నాయి. వేడి వేడి టీ సిప్

చేస్తూ బాల్కనీలో రిలాక్సయ్యాడు.

కాంక్రీట్ జంగిల్స్‌లో నిత్యం అనేక సమస్య లతో సతమతమయ్యే పెద్ద మనుషులను సేద దీర్చి, ఆహ్లాద పరచడానికి ఈ అందమైన ప్రకృతిలో కట్టబడిన రిసార్ట్స్ అవి. పిల్లలతో కలిసి టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ ఆడటం, తన కిష్ట మైన బిలియర్డ్స్, జిమ్, ఉల్లాసంగా స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చాలా హాయిగా ఉంది. మధ్యలో క్వాలిస్ బుక్ చేసి అరకు చుట్టుప క్కల తిరిగారు. ప్రకృతి అందాలను ఉత్సాహంగా క్యామ్‌కార్డ్ (చేతిలో ఇమిడిపోయే వీడియో కెమేరా)లో బంధించారు. ఎలా గడిచిపోయాయో తెలీదు మూడు రోజులు.

★ ★ ★

క్వాలిస్‌లో తిరుగు ప్రయాణమయ్యాడు. పొద్దున్నే చలి అని మధ్యాహ్నం లంచ్ చేసి బయలుదేరాడు. కొంచెం దూరం బానే సాగింది. తర్వాత బండి జర్క్‌లిస్తూ ఆగిపోయింది. సంపత్ కంగారుపడ్డాడు. బండి చెక్ చేసిన డ్రైవర్ ఏదో ప్రాబ్లమ్ చెప్పాడు. ''ముందుగానే బండిని చెక్ చేసుకోవచ్చు కదా'' అంటూ డ్రైవర్‌పై మండిపడ్డాడు.

''ఇప్పుడీ అడవిలో మెకానిక్ ఎక్కడ దొరుకుతాడు'' మరోసారి విసుక్కున్నాడు. చూసొస్తానని వెళ్ళిన డ్రైవర్ దాదాపు ఓ గంట తర్వాత వచ్చి ఎవరూ దొరకలేదని, వేరే బండి చూసుకోవల్సిందే అని చెప్పడంతో అసహనం, చికాకు, కోపం, కసి అన్నింటితో ఒక్కసారిగా నిండిపోయింది అతని మనసు.

దాదాపు రెండు గంటలు గడిచినా వాళ్ళకు ఏ వాహనం దొరకలేదు. అసలు వచ్చినవే కొన్ని, అవి నిండుగా ఉండటంతో ఎక్కడానికి వీలుకాలేదు. ఎక్కడైనా ఖాళీ టాక్సీ కనపడితే పంపమని ఇద్దరు, ముగ్గురు డ్రైవర్లకు చెప్పాడు. కానీ ఒక్క టాక్సీ రాలేదు. సాయంత్రం అవుతోంది. చాలాసేపు తర్వాత వచ్చిన టాక్సీ డ్రైవర్‌ని ఎలాగైనా ఆపాలని శతవిధాల ప్రయత్నించాడు. ఎంత డబ్బైనా ఇస్తానని ఆశ చూపెట్టాడు. కానీ అప్పటికే అందులో కొందరు ప్రయాణీకులు ఉండటంతో ఆ ట్యాక్సీవాడు ఏమీ చేయలేకపోయాడు. పోనీ ఏదైనా బస్సులైనా వస్తాయేమోనని ఎదురుచూసిన వాళ్ళకి అక్కడా నిరాశే ఎదురైంది. ఏదో రాష్ట్రంలోని ఎవరో పెద్దమనిషిని ఏదో నేరంపై అరెస్ట్ చేయడంతో అతనికి సపోర్ట్‌గా ఉండే ప్రతిపక్ష రాజకీయ పార్టీలు బంద్‌కి పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది ఆ రాజకీయ పార్టీ ప్రత్యర్థే. ఇంకేముందీ, సందు చూసుకొని ఎక్కడ గోల చేయొచ్చో అక్కడల్లా గొడవలు చెలరేగాయి. ముఖ్యంగా ఎవరికి ఏమొచ్చినా నష్ట పోయేది ఆర్టీసీ బస్సులే కనుక వాళ్ళ దెబ్బలకు రెండు, మూడు బస్సులు అద్దాలు పగలడమే కాక ఒక బస్సు డ్రైవర్ కూడా ఈ దాడిలో గాయపడడంతో బస్సులనూ ఆపేశారు.

నిజానికి బంద్ గురించి ముందే తెలిసినా తను వెళ్ళేది వైజాగ్ దాకానే అదీ ట్యాక్సీలో కనుక బంద్ గురించి పెద్దగా పట్టించుకోలేదు సంపత్. అసలే ఆ రూట్లో బస్సులు తక్కువ. దానికి తోడు కష్టాలన్నీ కట్టగట్టుకొని వచ్చినట్లుంది సంపత్‌కి. ఆ ఏరియాలో కనీసం సెల్ ఫోన్ కవరేజీ కూడా లేదు. టీవీ ఎడ్వర్టైజ్‌మెంట్లలో మాత్రం కొండల్లో, అడవుల్లో కూడా కవరేజీ వున్నట్లుగా ప్రకటనలు గుప్పిస్తారు. ప్రసిద్ధి చెందిన టూరిజం ప్లేస్ అరకు చుట్టుపక్కల మాత్రం కవరేజీ లేదు. మరోసారి తన దురదృష్టానికి తననే నిందించుకొన్నాడు.

★ ★ ★

''చలికాలం త్వరగా చీకటి పడుతోంది. ఇక ఏది దొరికితే దాంట్లో వెళ్ళి తీరాలి. లేకపోతే చాలా కష్టం'' అంది కళ్యాణి. ''అలాగేలే'' అంటూ ఆ దారి వైపే చూడసాగాడు సంపత్. అతని నిరీక్షణ ఫలించిందా అన్నట్లు ఓ అంబాసిడర్ కారు, ఓ ట్రాక్టరు ఒకదాని వెంట ఒకటి వచ్చాయి. అయితే అప్పటికే వాటి నిండా జనం ఉన్నారు. బహుశా కూలి పని మీద వచ్చారో లేదా అడవిలో పండే వ్యవసాయ ఉత్పత్తులను పట్నానికి చేర వేస్తున్నారో మొత్తానికి వచ్చేటప్పుడు తను రైల్లో చూసి విసుక్కొన్న మనుషులకు ఏమాత్రం తీసిపోనట్టు ఉన్నారు. కానీ ఏం చేయగలడు? అవసరం. అందుకే ఆపాడు. ఆపాడు అనడం కన్నా వీళ్ళని చూసి వాళ్ళే వాళ్ళ కారుని ఆపారనడం సబబుగా ఉంటుందేమో!

''ఏంటి బాబు! కారుకేమైందీ'' కారులో నుండి ఓ కంఠం ''కారు చెడిపోయింది. కాస్త సిటీదాకా లిఫ్ట్ ఇస్తారా?'' మొహమాట పడుతూ అడిగాడు సంపత్.

సిటీ అంటే అర్థం కాదేమో అని ''ఊళ్ళోకి కాస్త దిగబెడతారా?'' అని అడిగింది కళ్యాణి.

కారులో చిన్న కలకలం.

''ఎడిచిపెట్టొచ్చు కానీ, బండిలో స్థలం'' అన్నదో కంఠం.

''పోనీ వెనుకబండిలో ఏమనా చోటుందర్రా'' ఎవరో అరిచారు.

''పెద్దోళ్ళు ఆ బండిలో ఎలా వస్తార్రా'' ఎవరో గదిమారు.

''అలాగని ఈ యేలప్పుడు ఈ అడవిలో ఎలా?''

''ఏంటిరా గోల? ఏమైంది'' వెనక ట్రాక్టరు నుండీ ఎవరో అరిచారు.

''ఏహే! ఉండండి. తమరు రండి బాబు కారులో ముందు కూర్చొన్న ఒకాయిన సంపత్‌ని సాదరంగా ఆహ్వానించాడు''

''సరిపోదేమో...'' కొంచెం సందేహిస్తూ అన్నాడు సంపత్.

''ఫర్లేదు బాబు..ఇంతమంది ఉన్నాం. ఇంకో ఇద్దరికి పెద్దకట్టమేమి కాదు. చంటోళ్ళని ఎవరికాడైనా ఎట్టుకుంటాం''

సమస్యని చిన్నది చేసేస్తూ చెప్పాడు.

సంపత్ మాట్లాడేలోపు ఆ పెద్దాయినే అందుకొన్నాడు. ''ఒరే అప్పలస్వామి, రాముడు మీరు కాస్త ట్రాక్టర్లో సర్దుకోండి రా. ఓ నూకాలమ్మా కాస్తా ఆ ఆడకూతురికి కాస్త జాగా ఇచ్చి సదురుకోండి. రండి బాబు..సామానులిటివ్వండి..'' చక చకా సామాను తీసి కాస్త కారు పైన, కాస్త ట్రాక్టర్లోనూ సర్ది సంపత్ కుటుంబం మొత్తాన్ని టాక్సీలో ఎక్కించాడు.

టాక్సీలో ఇంతమంది వెళ్తున్నారు. అయినా వీళ్ళు టాక్సీలో వెళ్ళడమేంటి? సంపత్ ఏదో ఆలోచనలో పడి ''మీరందరూ..'' అన్నాడు. ''మాది ఈ దగ్గర్లోనే చిన్న ఊరు బాబూ! ఏదో పట్నంలో మా అందరికీ కాస్త పని దొరికితే వెళ్తున్నాం. ఈ డ్రైవరు కూడా మా ఊరోడే. సరేలే అని అందరం ఇట్టా ఎడుతున్నాం. తమరికేమి ఇబ్బందిగా లేదు గదయ్యా'' చాలా మర్యాదగానే అన్నాడు పెద్దాయన.

సంపత్‌కి బాగా గిల్టీగా ఉంది. అసలు కార్లో ఏమాత్రం స్థలం లేకపోయినా తమ కుటుంబం మొత్తాన్ని కార్లోనే ఎక్కించుకొన్నారు. తమ కోసం వాళ్ళు ఇబ్బందిపడుతూ ట్రాక్టర్లో ఎక్కారు. కానీ ఆరోజు ఇలాంటివాళ్ళు రైల్లో తనతోపాటు ఎక్కినప్పుడు తనెంత చీదరించుకున్నాడు. ఆ రోజు రైల్లో చాలామందికే సరిపోయే స్థలముంది. స్థలం లేనిదల్లా తన హృదయంలోనే. ఎంత చదివితేమి? ఎన్ని దేశాలు తిరిగొస్తేనేమి, హృదయాన్ని కొద్దిగా కూడా విశాలం చేసుకోలేకపోయాడు. ఆలోచించే కొద్దీ వాళ్ళ ముందు తానెంతో చిన్నవాడిగా కన్పిస్తున్నాడు తనకే. ఆ రోజు రైల్లో వారందరూ ఎక్కడం వలన రైలులో బాగా ఇరుకనిపించింది తనకు. కానీ ఇప్పుడర్థమౌతోంది తనకు ఇరుగ్గా ఉన్నది రైలు పెట్టె కాదు తన మనసని.

☆